● వరద ముంపు ప్రాంతాల్లో..



గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ జీహెచ్ఎంసీ ఈఈ శ్రీనివాస్, వారి సిబ్బందితో కలిసి బుధవారం అరుంధతినగర్ బస్తీతో పాటు అశోక్‌నగర్ 1, 2 స్ట్రీట్‌లలో పర్యటించి వరదనీటి ముంపు సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈఈ గీత, ఏఈ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, బీజేపీ నేతలు వినయ్‌కుమార్, ఎం.ఉమేష్, ఆనంద్‌రావు, అరుణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

- చిక్కడపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి)

● చెత్త సేకరించే రిక్షాల పంపిణీ



నింబోలిఅడ్డలో 8 మంది పారిశుధ్య కార్మికులకు చెత్త సేకరించే రిక్షాలను కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు మల్లికార్జున్, రాజ్‌కుమార్, మహేష్, శ్రీనివాస్, రఘు, దశరథ్, కృష్ణ పాల్గొన్నారు.

- బర్కత్‌పుర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి)

● వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు



భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలికాలనీలో వరదనీటి నాలాలో, శేఖర్‌రెడ్డి వీధి, రంగానగర్ నాలాలో పేరుకుపోయిన మట్టి తొలగించే పనులను బుధవారం కార్పొరేటర్ గౌసుద్దీన్, ఎంఐఎం నాయకులు పరిశీలించారు.

- ముషీరాబాద్,
- అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి)

● డ్రైనేజీలో వ్యర్థాలు..



రాంనగర్ డివిజన్‌లోని బాకారంలో డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి వ్యర్థాల తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కె.రవిచారి, స్థానికులు సత్యేందర్, శివ, యాదగిరి తదితరులు

- రాంనగర్, అక్టోబర్ (ఆంధ్రజ్యోతి)

● టీపీసీసీ అధ్యక్షుడికి సత్కారం



బీసీ కులగణనకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జీవో 18జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్‌ను కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, రాష్ట్ర లేబర్ బోర్డు వైస్ చైర్మన్ నాగభూషణం, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, చందు పటేల్, తొలుపునూరి నరేష్‌గౌడ్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పూలబోకే అందజేసి, శాలువాకప్పి ఘనంగా సత్కరించారు.

- నల్లకుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి)

● ఉషశ్రీకి ప్రశంసా పత్రం



సెప్టెంబర్ 10 నుంచి 30వ తేదీ వరకు చేపట్టిన మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదులో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం, జాతీయ స్థాయిలో రెండో స్థానంలో నిలిచిన ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీని బుధవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ప్రశంసా పత్రం అందజేస్తున్న మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు అల్కలంబ, రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు

- రాంనగర్ (ఆంధ్రజ్యోతి)

ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తాం



ఆర్.దేవేందర్, ముషీరాబాద్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ

జీహెచ్ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ పరిధిలోని ప్రధాన రహదారులు, చౌరస్తాలలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన డబ్బాలు, ఇతర నిర్మాణాలను తొలగించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టామని సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఆర్.దేవేందర్ తెలిపారు. నగర ట్రాఫిక్, పోలీసు అధికారులు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపునకు స్పెషల్ డ్రైవ్ చేపట్టిన నేపథ్యంలో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

- రాంనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి)

ముఖాముఖి

ఆంధ్రజ్యోతి : ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో ఫుట్‌పాత్ ఆక్రమణలు గుర్తించారా?

టౌన్‌ప్లానింగ్ ఏసీపీ : ముషీరాబాద్ సర్కిల్ పరిధిలోని లోయర్ ట్యాంక్‌బండ్, గోషాల, ముషీరాబాద్ చౌరస్తా, ఇందిరా పార్కు, ఆర్టీసీ క్రాస్‌రోడ్, రాంనగర్ చౌరస్తా, చిక్కడపల్లి, నారాయణగూడ, హిమాయత్ నగర్ లిబర్టీ ప్రధాన రహదారుల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి చాలామంది వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో పాదచారులు ఇబ్బందులుపడుతున్నారని ఫిర్యాదులు వచ్చాయి. ఆయా ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగిస్తున్నాం. ఇప్పటికే ముషీరాబాద్ చౌరస్తా మెయిన్ రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన డబ్బాలు, షెడ్లు తొలగించాం.

ఆంధ్రజ్యోతి : జంక్షన్ల వద్ద ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

టౌన్‌ప్లానింగ్ ఏసీపీ : సర్కిల్ పరిధిలోని ప్రధాన జంక్షన్ల చుట్టూ ఉన్న ఫుట్‌పాత్‌లను ఆక్రమించి చాలామంది చిరువ్యాపారాలు చేస్తున్నారు. దీనివల్ల జంక్షన్లు ఇరుకుగామారి బస్సులు ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ నేపథ్యంలో జంక్షన్ల వద్ద ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపట్టాం.

ఆంధ్రజ్యోతి: ఫుట్‌పాత్‌లపై నాయకులు ఏర్పాటు చేసిన డబ్బాలను తొలగిస్తారా?

టౌన్‌ప్లానింగ్ ఏసీపీ : ఫుట్‌పాత్‌లపై రాజకీయ నాయకుల ప్రోద్బలంతో పాన్ డబ్బాలు, టీ స్టాల్స్ టిఫిన్ సెంటర్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఏర్పాటు చేసి వారికి రోజువారీగా అద్దెలు చెల్లిస్తున్నట్లు సమాచారం ఉంది. రోడ్డును ఆక్రమించి షాపులు ఏర్పాటు చేసి అద్దెలకు ఇచ్చే డబ్బాలను కూడా తొలగిస్తాం.

ఆంధ్రజ్యోతి : ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించొద్దని ప్రజా ప్రతినిధుల నుంచి వచ్చే ఒత్తిళ్లను ఎలా అధిగమిస్తున్నారు?

టౌన్‌ప్లానింగ్ ఏసీపీ : ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపు విషయంలో ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గేది లేదు. ఫుట్‌పాత్ ఆక్రమణలు వాటి వల్ల జరిగే ఇబ్బందులను ప్రజా ప్రతినిధులకు వివరించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

హామీలను అమలు చేసే వరకు కాంగ్రెస్‌ను వదిలిపెట్టం

- కేసీఆర్, కేటీఆర్ పోరాటంలో భాగస్వాములవుతాం
- బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ



ముఠా జైసింహ

రాంనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు బీఆర్ఎస్ పార్టీ వదిలిపెట్టదని ఆ పార్టీ యువజన నాయకుడు ముఠా జైసింహ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ల నాయకత్వంలో నిరంతరం పోరాటం చేస్తామని అన్నారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, 15 వేల రైతు భరోసా, ఆసరా పెన్షన్‌ల పెంపు, పేదలకు ఇందిర్మ ఇళ్ల నిర్మాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగాలు, బీసీ డిక్లరేషన్, ఎస్సీ డిక్లరేషన్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల్లో లక్ష రూపాయలతో పాటు తులం బంగారం వంటి హామీలను అమలు చేయడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. హామీలపై నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు హైడ్రాను తెరపైకి తీసుకువచ్చి ప్రజలలో గందరగోళం సృష్టించారని ఆయన ఆరోపించారు. మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇళ్లను కూల్చడం అన్యాయమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వ్యవస్థ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అధ్వాన్నంగా మారి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో శాంతిభద్రతలు క్షీణించాయని, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తున్నామని వివరించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఆయన వివరించారు.



ముషీరాబాద్‌లోని గంగపుత్రకాలనీలో దుర్గామాత ఒడిబియ్యంతో చేపట్టిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముఠా జైసింహ

- ముషీరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి)

27న ఎన్టీఆర్ స్టేడియంలో సదర్ సమ్మేళనం



మాట్లాడుతున్న ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్

రాంనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో ఈనెల 27న ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న సదర్ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ సూచించారు. బుధవారం ఆదర్శ్‌నగర్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఆదివారం ఉదయం 11 నుంచి సాయంత్రం వరకు సదర్ సమ్మేళనం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, యూపీ మాజీ సీఎం అఖిలేష్‌యాదవ్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శంకర్‌యాదవ్, కన్నె రమేష్‌యాదవ్, టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు

26న చలో ఢిల్లీ

బర్కత్‌పుర: దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనగణనలో కులగణన చేపట్టాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని, కేంద్ర బడ్జెట్‌లో బీసీల అభివృద్ధికి 2 లక్షల కోట్ల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న చలో ఢిల్లీ, పార్లమెంట్ ఎదుట మహాధర్నా నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. తెలంగాణతో పాటు ఏపీ, కర్ణాటక, తమిళనాడు, ఉత్తరాది రాష్ట్రాల నుంచి వేలాదిగా బీసీలు పాల్గొని పార్లమెంట్ ముందు మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నందగోపాల్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, జోషి రాఘవ, రఘుపతి, ఉదయ్‌నేత, మోదీ రాందేవ్, రవియాదవ్, నిఖిల్, దేవేందర్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

టీజేఎంయూ నూతన కమిటీ నియామకం

రాంనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో బుధవారం టీజేఎంయూ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు టీజేఎంయూ వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.హనుమంతు ముదిరాజ్ తెలిపారు. అధ్యక్షుడిగా డీవీకే రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ స్వాములయ్య, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ పి.శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి కె.హనుమంతుముదిరాజ్, ఉపాధ్యక్షులు గోలీ రవీందర్, వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శిగా పి.కె.మూర్తి నియమితులయ్యారు.

జీవనసాఫల్య పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో బుధవారం త్యాగరాయగానసభలో ప్రముఖ ఆధ్యాత్మిక కవి ఉమ్మడిసింగు కృష్ణారావు 85వ జయంతిని పురస్కరించుకుని వివిధ రంగాల ప్రముఖులకు కృష్ణారావు స్మారక జీవన సాఫల్య పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం, బహుభాషా కవి సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆదర్శ ఫౌండేషన్ స్వచ్ఛందసంస్థ చైర్మన్ వంగాల బాల్‌రాజ్‌గౌడ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రముఖ సంగీత గురువు కపిల వరలక్ష్మిని, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త పీసపాటి నాగేశ్వర శర్మలకు జీవనసాఫల్య పురస్కారాలు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి డా. రాధాకుసుమ, కోకా భవాని, విజయకుమార్, మానస సంస్థ స్థాపక కార్యదర్శి కవి రఘుశ్రీ, బండారుపల్లి రామచంద్రరావు, లలితవాణి పాల్గొన్నారు.

ప్రపంచ శాంతిని కోరుతూ ర్యాలీ

బర్కత్‌పుర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతిని కోరుతూ తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో బుధవారం బర్కత్‌పురలోని రాజా బహదూర్ వెంకట్రామరెడ్డి మహిళా కళాశాల నుంచి అబిడ్స్ వరకు నిర్వహించిన ర్యాలీలో రెడ్డి మహిళా కళాశాల, జాగృతి డిగ్రీ, పీజీ కళాశాల, ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్, రెడ్డి మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ విజయలక్ష్మి, నవ భారతి నిర్మాణ ఫౌండేషన్ అధ్యక్షుడు హేమంత్, హైకోర్టు న్యాయవాది ఎట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

కుటుంబసభ్యులకు భారం కాకూడదని
95 సంవత్సరాల వృద్ధురాలి ఆత్మహత్య

చిక్కడపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కుటుంబసభ్యులకు భారం కాకూడదని 95 సంవత్సరాల వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ బి.రాజునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్‌లోని దీక్షిత అపార్ట్‌మెంట్స్‌లో సరోజినీదేవి(95) నివసిస్తున్నారు. ఆమె భర్త గతంలోనే చనిపోయాడు. ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. ఒక కుమారుడు అమెరికాలో ఉంటారు. మరో కుమారుడు సరోజినీదేవి ఇంటికి సమీపంలోనే మరో అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాడు. సరోజినీదేవిని చూసుకోవడానికి సహాయకురాలిని ఏర్పాటు చేశారు. కుటుంబసభ్యులు కూడా వచ్చి ఆమె బాగోగులు చూస్తుంటారు. రెండురోజుల నుంచి సహాయకురాలు పనిలోకి రావడంలేదని సమాచారం. బుధవారం సరోజినీదేవి అగ్గిపెట్టెతో చీరకు నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇంట్లోనుంచి పొగలు వస్తుండడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి చూసి 80 శాతం కాలినగాయాలతో ఆమె అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. కుటుంబసభ్యులకు భారం కాకూడదనే సరోజినీదేవి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ తెలిపారు.



● తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ గ్లోబల్ పీస్ అవార్డు 2024ను తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్‌కు బుధవారం ఎమ్మెల్సీ డాక్టర్ బండ ప్రకాష్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. కార్యక్రమంలో కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

- బర్కత్‌పుర (ఆంధ్రజ్యోతి)